# నాగరాజీయమ్

రాయసం వెంకట్రామయ్య

11

నాగరాజుకి సావిత్రికి పెళ్లయిన కొత్త రోజులవి. మామగారు ముక్తేశ్వరరావుగారు పదిమాట్లు రమ్మంటే ఆ సంవత్సరం దసరా పండగలికి నాగరాజు అత్తవారింటికి వెళ్లాడు. వాడికి మామగారు మర్యాద చేయలేదనీ, చేశారనీ బాధలేదు. సావిత్రి పట్టుబడితే మోమాటంగా వచ్చాడు.

## అల్లుడికే నైవేద్యం

ముక్తేశ్వరరావుగారిదీ కోనసీమే. క్షణముక్తేశ్వరంలో పుట్టాడని ఆయనకి ముక్తేశ్వరరావు అని పేరు పెట్టారనేవారు. ఆయన పేరుకి తగినట్టే దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఉద్యోగం చేసేవాడు. ఆ ఊళ్లో కేశవస్వామి గుడికి ఈయనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు. దేవాలయానికి మంచి ఆదాయం వచ్చేది. ముక్తేశ్వరరావుకి ముందు పనిచేసిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు తన సర్వీసంతా ఆ దేవాలయంలోనే చేశాడని చెప్పుకునేవారు.

నాగరాజు అత్తగారు వరలక్ష్మి గట్టిగా ఎవర్నో పిలిచింది ''వెంకన్నా, వెంకన్నా! ఎక్కడున్నావురా?'' అంటూ.

''ఎంకన్న లేడండీ. జొరమొచ్చిందని వెళ్లాడండి'' అన్నాడు కొంచెం కీచుకంఠంతో.

''ఎవరికీ చెప్పకుండా ఎలా వెళ్లిపోయాడ్రా వాడు. అల్లుడొచ్చాడు. ఇప్పుడే వీడికి జ్వరం రావాలా?'' అంటూ విసుక్కుందావిడ. తిరిగి కీచుకంఠం వాడ్ని ఉద్దేశించి అడిగింది ''ఉరేయ్ వీర్రాజూ! నీకు కొబ్బరి చెట్టెక్కడం వస్తే ముప్పేట కాయలు రెండు తియ్యగలవా తొందరగా?''

''నాకు చెట్టెక్కడం అంత బాగా రాదండీ. మా బాబు చూశాడంటే తోలు తీస్తాడండీ'' అన్నాడు సమాధానంగా వీర్రాజు.

''ఏడవలేకపోయావు. కంచెడన్నం తినరా అంటే తింటావుగానీ కొబ్బరికాయలు తియ్యడం రాదురా?'' నిక్కదీసింది వరలక్ష్మిగారు.

''చూస్తానండీ. చిన్న చెట్టయితే ఎక్కగల్నండి'' అంటూ వీర్రాజు పెరట్లోకి వెళ్లాడు. ముక్తేశ్వరరావుగారింటికి చాలా పెద్ద పెరడుంది. ఇంటి వెనుక పూల చెట్లు, ఓ పెద్ద ఉసిరిచెట్టు ఉన్నాయి. ఆ పెరట్లోంచి వెనకాల దొడ్డికి గోడ అడ్డం. వెనకాల దొడ్డిలో కొబ్బరిచెట్లు, ఓ పెద్ద చింతచెట్టు ఉన్నాయి.

వీర్రాజు కొబ్బరి త్రాటితో కాలికి బందము తయారు చేశాడు. తలపాగ పెట్టుకున్నాడు. కొడవలి వెనకాల తగల్చుకుని కొబ్బరి చెట్టు ఎక్కాడు. అది చిన్న చెట్టే. వీర్రాజుకి పదిహేనేళ్లయినా పదేళ్లవాడిలా ఉంటాడు. అర్భకుడు. యజమానురాలి మాట కాదన్లేక చెట్టెక్కేశాడు వీర్రాజు. చెట్టుపైకి ఎగబాకి నాలుగైదు కొబ్బరికాయలు త్రెంచి క్రింద పడేశాడు. వాడ్ని చెట్టుపైని ఓ కందిరీగ కుట్టింది. ఆ మంటకి తట్టుకోలేక చేత్తో ఈగ కుట్టిన చోట రాసుకున్నాడు. చేతిలో కొడవలి, కాళ్లకున్న బందం జారి క్రిందపడ్డాయి. వీర్రాజు చెట్టుపైనే ఉండిపోయాడు.

ఓ అరగంటపోయాక ''అమ్మగారూ! అమ్మగారండీ'' అంటూ అరవడం మొదలుపెట్టాడు. దక్షిణం వైపు వరండాలో కూర్చుని పేపరు చదువుతున్న నాగరాజుకి వీర్రాజు కేకలు వినబడ్డాయి. తిన్నగా పెరట్లోకి అక్కడ్నించి వెనుక దొడ్డిలోకి వచ్చి చూశాడు. అప్పుడు నాగరాజుకర్థమైంది విషయం. క్రిందపడ్డ కొబ్బరికాయలు అరుగుమీద పెట్టి తిరిగి వచ్చాడు.



ఈలోపల వీర్రాజు అరుపులకు వరలక్ష్మి, సావిత్రి కూడా వచ్చారు.

''ఏమిట్రా గోల? ఏమైంది? కాయలు కోశావా?'' అంటూ వచ్చింది వరలక్ష్మిగారు. నాగరాజుని చూసి సావిత్రితో ''అల్లుడుగార్ని వెళ్లి పేపరు చదువుకోమను'' అంది ఆవిడ.

వీర్రాజు భయంతో ''అమ్మగారూ! నేను దిగలేనండీ. నాకు క్రిందకి చూస్తే కాళ్లు వణుకుతున్నాయండీ'' అన్నాడు బిగ్గరగా.

నాగరాజు సావిత్రితో ఏదో చెప్పాడు. సావిత్రి త్వరగా ఓ పెద్ద మోకు తెచ్చింది. అది జనపనారతో

నేసిన మోకు. నాగరాజు దాన్ని వొడుపుగా పట్టుకుని కొబ్బరిమొవ్వు పైకి విసిరాడు. నాలుగైదుసార్లు విసిరినా అది వీర్రాజు కూర్చున్న చోటికి వెళ్లలేదు. ఆ మోకు చివర ఓ కర్రకి కట్టి ఆ కర్రని విసిరాడు నాగరాజు. రెండోసారి అది కొబ్బరిచెట్టు మొవ్వుకి తగులుకుంది. నాగరాజు చెప్పినట్లే వీర్రాజు ఆ మోకుని కొబ్బరి మట్టలకి చుట్టి కొస గట్టిగా నడుముకి కట్టుకుని దిగడం ప్రారంభించాడు. నాగరాజు మరో కొస గట్టిగా పట్టుకుని మెల్లమెల్లగా తాడుని జారుస్తూ వీర్రాజుని క్రిందకి దించాడు. వాడు క్రిందకు దిగి భోరుమని ఏడ్చాడు.

వరలక్ష్మి, సావిత్రి వాణ్ణి ఎలాగో సముదాయించారు. వాడు మళ్లీ ఎప్పుడూ కొబ్బరిచెట్టు ఎక్కనన్నాడు.

నాగరాజు కాళ్లు చేతులు కడుక్కుని కేశవస్వామి గుడికి వెళ్లి వస్తానని బయలుదేరాడు. నాగరాజు తిరిగి వచ్చేసరికి అరగంట పట్టింది. అప్పటికి దాదాపు తొమ్మిది గంటలు దాటుతోంది. నాగరాజు గుడి నుండి తెచ్చిన కుంకుమ, కొబ్బరి చెక్క సావిత్రికిచ్చాడు.

లోపల్నుంచి ''సావిత్రీ! టిఫెను పెట్టు ఆయనకి'' అంటూ పిలిచింది కూతుర్ని వరలక్ష్మిగారు.

సావిత్రి వంటింటికి వెళ్లి తల్లి ఇచ్చిన చక్కెర పొంగలి రెండు ప్లేట్లలో పెట్టి పట్టుకొచ్చింది. తర్వాత మంచినీళ్లు నాగరాజు కోసం ఓ గ్లాసుతో మజ్జిగ కూడా తెచ్చి కుర్చీ పీట మీద ఉంచింది. నెమ్మదిగా నాగరాజుతో ''టిఫెను తినండి'' అంది సావిత్రి.

''ఏమిటీ టిఫెను?'' అన్నాడు ఆశ్చర్యంగా నాగరాజు.

''ప్రసాదమండీ. ఇవ్వాళ గుళ్లో దేవుడికి చక్కెర పొంగలి ప్రసాదం'' అంది అమాయకంగా సావిత్రి.

ముక్తేశ్వరరావుగారు కూడా దేవాలయానికి వెళ్లి మళ్లీ వచ్చాడు. గుడికి, ఎక్జిక్యూటివ్ ఆఫీసర్‌గారింటికి ఓ నూరుగజాల దూరంకన్నా ఉండదు. ఆయన ఏవో కాగితాలు తిరగేస్తూ హాల్లో కూర్చున్నారు. మధ్యలో తలెత్తి ''అమ్మా సావిత్రీ! అతనికి టిఫెను, అదీ ఇచ్చావా?'' అని అడిగాడు.

''ఇచ్చా నాన్నా'' అంది సావిత్రి వైపే చూస్తూ.

నాగరాజు ఆలోచనల్లో పడ్డాడు. ఏం తోచిందోగానీ మజ్జిగ గడగడా త్రాగేశాడు ముందుగా.

''నేనిప్పుడు టిఫెను తినన్లే'' అన్నాడు సావిత్రితో.

''ఎందుకు తినరూ. వంట అయ్యేసరికి పన్నెండుగంటలు దాటుతుంది. మీరుండలేరు. తినండి'' అంది అనునయంగా.

''ఇప్పుడు తినాలని లేదు. వద్దులే''

''ప్రసాదమండీ. అలా వద్దనకూడదు'' అంది సావిత్రి.

''నా ముఖం, ఇది ప్రసాదమా?'' అన్నాడు నాగరాజు.

''నిజంగా ఇది ప్రసాదం. మా అమ్మ చేయలేదు. గుడిలో పూజారి ఆచారిగారు పంపారు. వైష్ణవులు చక్కెర పొంగలి బాగా చేస్తారు. మీరు తింటే వదలరు'' అంది నాగరాజు నెలాగైనా తినిపించాలని.

''నాకు ఆకలిగా లేదు'' అన్నాడు నాగరాజు కంఠస్వరం తగ్గించి.

''మీరు తినకపోతే నేనూ తిన్ను. పండక్కి వచ్చిన అల్లుడు అలిగాడనుకుంటారంతే'' అంది నిస్సహాయత చూపిస్తూ సావిత్రి.

''అసలు విషయం...'' అంటూ మధ్యలో ఆపేసి తిరిగి ''ఇప్పుడెందుకులే'' అన్నాడు నాగరాజు.

''ఏమిటా విషయం. మీరు చెప్తేగానీ వీల్లేదు''

''ఏంలేదు. నేను దేవుడి దర్శనానికి వెళ్లిప్పుడే వచ్చానుగా. ఇంకా దేవుడికి మహానైవేద్యం పెట్టలేదు. ముందుగా నాకెందుకీ చక్కెర పొంగలి. దేవుడికన్నా ముందు అల్లుడికా నైవేద్యం?'' అన్నాడు నాగరాజు కొంచెం ఆవేశంగా.

''అది కాదండీ. మనకోసం ఆచారిగారికి చెప్పి ఈ రోజు చక్కెర పొంగలి చేయించాడు మా నాన్న. మీరు గట్టిగా మాట్లాడకండి మా అమ్మా నాన్నా బాధపడతారు'' అంది సావిత్రి జాలిగా.

''అలాగైతే సరే'' అన్నాడు నాగరాజు. సావిత్రి 'అమ్మయ్యా' అనుకుంది.

**(సంగీతముతో... వచ్చేవారం)** ★


**ఆమె అందాలరాశి**

**అతను కోటీశ్వరుడు**

**ఆమె కాల్‌గర్ల్**

**అతను విటుడు**




ప్రసరించే కాంతిపుంజమే!

# ముఖమల్ ముబ్బు

సీరియల్ త్వరలో...